# పద్మ-సావిత్రీ

**కాఫీ** త్రాగి బయుటికి వచ్చేసరికి గోపాలం దృష్టి ఎదురుగా ఉన్న కిళ్లీ షాపు దగ్గరి పోస్టర్ మీద పడింది. త్రివర్ణచిత్రంతో, ఆకర్షణీయుంగా ఉన్న ఒక చక్కని చిత్రమూ, దాని క్రింద ఆ చిత్రంలోని నర్తకి నాట్యప్రదర్శన వేళల గురించీ ఉన్నై.

సిగరెట్ ముట్టించి పోస్టర్ వంక చూస్తున్నాడు.

హోటల్ చేరేసరికి ఆ వైపు నుంచి శశిరేఖ వస్తున్నది. తన మానసికస్థితిలో శశిరేఖ అక్కడికి రావడం గోపాలానికి ఏమీ ఉత్సాహకరంగా లేదు.

"హల్లో! సరీగా వచ్చానే?" అంది శశిరేఖ.

"సరీగానే... నేను రీడింగ్ రూమ్ దాకా పోయి వచ్చాను" అన్నాడు గోపాలం.

"కిళ్లీ కూడా వేశారే!... కాఫీ ఐపోయిందా?"

"ఆఁ... కృష్ణాలో త్రాగాను. ఈ హోటల్ కాఫీ

## ఇచ్ఛాపురపు జగన్నాథరావు

రుచించక.. నీకూ అక్కణ్నించే తెప్పిస్తాను."

శశిరేఖ నవ్వింది. "చాలా మంచివారుగా!... త్వరగా కానీండి".

గోపాలం సర్వెంటుని కాఫీకి పంపి, "కొంచెం పెందరాళే వచ్చావు ఏమిటి సంగతి?" అన్నాడు.

శశిరేఖ కొంచెం చిన్నబుచ్చుకుంది. సినిమాకు పోవడానికి తనను రమ్మని మరీ మరీ చెప్పి, ఇప్పుడీ ఔదాసీన్యం ఏమిటి?

"సినిమాకు పోదామనుకున్నాం, మీరు మరచిపోయారా?" అందామె సాధ్యమైనంత త్వరగా తన దెబ్బను దాచుకుంటూ.

"ఔనౌను.. నాకివాళ ఒంట్లో ఏమీ బాగుండలేదుగా; అన్నీ మరచిపోతున్నాను. నేను సిద్ధమే. ఇంకా ఇరవై నిమిషాలు టైమ్ ఉంది. నీ కాఫీ రాగానే బయలుదేరదాం..."

"ఒంట్లో ఏం? బయటికి మాత్రం విమ్‌టోలా ఉన్నారు" మళ్లా శశిరేఖ నవ్వింది-ఆ నవ్వులోని లేతదనమూ, కాంతీ ఎవరినన్నా ఉన్మత్తులుగా చేస్తాయ్... ఒకసారి ఆ పెదవుల వైపూ, మెరుస్తున్న దంతాల వైపూ జాలిగా చూశాడు గోపాలం.

"మాట్లాడరేం?"

"ఏమిటి?"

"ఏమిటి మీ ఒంట్లో జబ్బు, అని."

"ఏమీ లేదు."

"ఏదో ఉందన్నారే?"

"అదే-తెలీదు..."

అద్దం ముందు కూర్చుని తల దువ్వుకుంటూన్న గోపాలం చేతిలోని దువ్వెన తీసుకుని అతని తలదువ్వుతూ, "అంత తెలియుని బాధ ఏమిటబ్బా?" అంది శశి.

గోపాలాని కీ ప్రశ్న నవ్వు తెప్పించింది... తెలియుని బాధ... ఏమిటీ? అది తెలిస్తే...

శశి దువ్వెన విసిరి, అతని గడ్డం చేత్తో పైకెత్తి కళ్లల్లోకి చూస్తూ, "బొత్తిగా పనీ పాటూ లేనివాళ్లకు ఏమో తెలీని బాధలుంటాయిట!" అంది.

"ఎవరన్నారూ?"

"ఒక కవిశేఖరుడు ఇంగ్లీషువాడే ననుకోండి... పోనీ, మాఘమ్ అంటాను?"

"అయితే, నీకూ ఈ బాధ ఉంటూనే ఉంటుందన్నమాట?"

"ఊఁ... అందుకే రాత్రులు మీతో బీచ్ షికార్లూ, పగలు సినిమాలూ.. ఇవన్నీ."

ఇద్దరూ నవ్వుకున్నారు. శశి తత్వమే అది. ఆమె చుట్టుపక్కల విచారమూ, వికృతీ ఉండడానికి వీల్లేదు.

సర్వెంట్ కాఫీ తెచ్చి కప్పులో పోసి శశికి ఇచ్చాడు. శశి కాఫీ తాగుతూ వాడి చేతిలో ఉన్న కాగితం చూసి, "ఏంరా, ఎవరి పెళ్లి కా శుభలేఖ?" అన్నది.

"అదెవరి పెళ్లో నాకేం తెల్సునమ్మా?" అంటూ వాడా కాగితాన్ని ఆమె ముందు పడేశాడు.

శశి ఆ కాగితం చూస్తూ "చూశారా? మన వూరే వస్తోంది పద్మ. ది డ్రీమ్ గరల్.." అన్నది.

గోపాలం వెనుదిరిగి, పిడుగు పడినట్లు "ఎప్పుడు?" అన్నాడు.

"ఎల్లుండి. అది సరేకాని. మీరు ఫిలిమ్ ఫాన్ అనుకోలేదే?... ఇంత ఆత్రుత ఎందుకూ? పద్మ మీకు డ్రీమ్ గరల్ కాదనుకున్నాను" అన్నది శశి.

"ఔనని నే నన్నానా?"

"కాని, ఆ పేరు చెప్పేసరికంత చలనం ఎందుకొచ్చిందీ?"

"ఒంట్లో అలా ఉంది-అది సరేగాని, ఇక్కడి కెందు కొస్తుందట?"

"డాన్స్ ప్రోగ్రాం. సరస్వతీథియేటర్‌లో. లక్ష్మివారం సాయంత్రం ఆరు గంటలకు ప్రఖ్యాత సినిమా నటి శ్రీమతి పద్మాదేవి. వెంటనే మీ సీట్లు రిజర్వు చేసికోండి. రేట్లు ఇరవై, పది, ఐదు, రెండు!"

గోపాలం ఏమీ మాట్లాడలేదు.

"ఛాన్స్ ఉంటే అలా ఉండాలి. సరీగా మనం సరస్వతికి వెళ్లడం-అక్కడే టిక్కెట్లు దొరకడం..."

ఇద్దరూ బయటికి నడిచారు. తాళం వేసి, రెండడుగులు వేసి, గోపాలం ఒక్కసారి వెనుదిరిగి, తాళం జేబులో నుంచి బయటికి తీశాడు.

"ఏం మరిచారు?"

తలుపు తీసి డ్రాయర్‌లో వున్న సెంట్ బాటిల్‌లోని పరిమళాన్ని తన రుమాలుకు అంటించి జేబులో వుంచుకున్నాడు.

"చాలా ఆశ్చర్యంగా వుందే అంతా! మీరు వాడుతూన్నది ఆటో దిల్‌బహార్!" అంది శశి.

గోపాలం మాటలాడలేదు. తిరిగి సెంటు బాటిల్ తీసి ఆమె పైటకు రాసి, దాన్ని దాచేశాడు.



"క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్ అన్నారు గాని క్షణక్షణముల్ దొరగారి చిత్తముల్ అనాల్సింది..." అన్నది ఆశ్చర్యంగా శశి.

గోపాలం ఏమీ మాట్లాడకుండానే ఆమెను గది బయటికి తీసుకొచ్చి తాళం వేశాడు. మెట్లు దిగి రోడ్డు మీదికి వచ్చి, "నడుద్దామా, రిక్షానా?" అన్నాడు.

నలుగురు రిక్షావాళ్లు రానే వచ్చారు. మాట్లాడకుండానే ఆమె ఒక దానిలో ఎక్కింది. మిగిలినవాళ్లు వెనక్కు తగ్గాక, అతనూ ఎక్కాడు.

థియేటర్ దగ్గర దిగేదాకా ఎవరూ మాట్లాడలేదు. రిక్షావాడికి డబ్బులిచ్చి పంపుతూ, ఒకసారి జేబురుమాలు ముక్కు దగ్గర వుంచుకున్నాడు గోపాలం. శశిరేఖ విస్తుపోయి చూసింది.

థియేటర్‌లో కూర్చోగానే "అన్నీ అబద్ధాలు!" అంది.

"ఏమిటి?"

"మీ మాటలు!"

"ఏం?"

ఒక్కసారి గోపాలం ఉత్సాహంగా మాట్లాడసాగాడు. నవ్వుతూ ఆమె మీదికి వంగి, "ఏం?" అన్నాడు.

"వెళ్లి టికెట్లు తీసుకోరాదూ?" సంభాషణ తప్పిస్తూ అంది శశి.

"తీసుకుంటేనే లోనికి రానిస్తారమ్మాయ్!"

"ఎల్లుండికి..."

గోపాలం క్రిందికి నడిచాడు. మరో పావుగంట అయ్యేసరికి రెండు టిక్కెట్లు తీసుకొచ్చి ఆమెకిస్తూ, "దాచు" అన్నాడు.

"మీ దగ్గరే వుంచండి."

"నేను ఎల్లుండి ఇక్కడ వుండకపోవచ్చును."

"అయితే, నేనూ రాను!"

గోపాలం టికెట్లు తన పర్స్‌లో వుంచాడు.

"సిగరెట్ కాల్చుకొనేదా?"

"పొగ కాస్త అటు వదలండి!"

సిగరెట్ ముట్టించాడు. మూడో గంట కొట్టి సైడ్ రీల్స్ ప్రారంభించారు. కొద్ది నిముషాలయ్యాక, "నా పుట్టినరోజు నాటి కథ జ్ఞప్తిలో వుందా?" అంది శశి.

ఆ సాయంత్రం శశి, గోపాలం సముద్రతీరం వెంటే షికారు పోతున్నారు. ఎందుకో ఆ రోజతను చాలా నిరుత్సాహంగా కనిపిస్తే, శశి అడిగింది 'ఏం అలా ఉన్నారు?' అని.

వాస్తవానికి గోపాలం ఆ కారణాన్ని తెలుసుకోలేకపోయాడు. పూర్వస్మృతులు అతన్ని వెంటాడుతూ బాధించడమే దానికి కారణం. కాని, ఆ నాడు ఆ స్మృతులంతగా ఎందుకు రావాలో అతనికి బోధపడలేదు.

కొద్ది నిమిషాలతనేమీ మాటలాడలేదు. ఊరంతా దాటి, స్కాండల్ పాయింట్ దాటి, ఒక చోట ఇద్దరూ కూర్చున్నార. తెల్లని చీరా, నీలి బ్లౌజు వేసుకున్న శశిరేఖ చాలా ఆకర్షణీయంగా కనిపిస్తూంది. మరొక సమయంలో అతని ఆ సౌందర్యసముద్రంలో మునిగి తేలేవాడే-కాని...

గాలికి ఆమె పయ్యెద ఎగిరివచ్చి అతని ముఖానికి చుట్టుకుంది. ఒక్కసారి అది ముఖం నుంచి తీసుకుని దాన్ని తిరిగి వాసన చూస్తూ. "దిల్ బహార్ సెంటు" అన్నాడు.

ఈ కథను ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 12.8.1953 సంచికలో ప్రచురించాము

"ఊఁ" అందామె.

"నువ్విదేనా రోజూ వాడతావ్?"

"లేదు-ఈ రోజా..."

కొద్దికాలం తిరిగి నిశ్శబ్దంగా ఉండి, "ఇంకెన్నడూ ఆ సెంటు మాత్రం వాడవు కదూ?" అన్నాడు గోపాలం.

"ఏం?" అందామె, ఆశ్చర్యంగా.

"చెప్తాగా.. కాని, మరెన్నడూ. వాడకు..."

ఎంత అడిగినా మరేమీ చెప్పలేదతను, తరవాత ఇంకెప్పుడూ ఆ విషయమూ సంభాషణలోకి రాలేదు.

అతని ఆలోచన లనేకవిధాలుగా సాగుతున్నై. సాయంత్రం అంతా అలాగే గడిచింది. రాత్రి భోజనం అయాక తిరిగి అలాగే కూర్చున్నాడు. రాత్రంతా జాగారమే చేశాడేమో!

గతించిన తన చరిత్ర-తమ చరిత్ర భూతంలా వెంటాడుతోంది. భవిష్యత్తేమో అతనికి తెలియడం లేదు...

అదంతా నాలుగు సంవత్సరాల క్రిందట...

గోపాలం తండ్రికి ఒక్కడే కొడుకు. తల్లి లేదు. అతను బి.ఏ. పాసయేసరికి ఎన్నో సంబంధాలు వచ్చాయి. ఏరి, కోరి అతను సావిత్రిని వివాహం చేసుకున్నాడు

పెళ్ళయి, మనుగుడుపులూ అయి, సావిత్రి అత్తవారింటికి వచ్చింది. క్రొత్తగా ధనవంతుల ఇంటికి రావడం కాదు-ఆమె ధనవంతుల ఇంటి నుండే వచ్చింది.

తన జీవితం ఇంక అత్యంతసౌఖ్యంగా సాగుతుందని ఆశపడ్డాడు గోపాలం. రూపవతి సావిత్రి. పచ్చటి ఛాయ! చక్కని సౌష్ఠవం, వీటికి తోడు అత్యంతమూ సౌమ్యత, మంచితనమూను.

ఆమె గది మేడ మీద తూర్పుగది. రోజూ సాయంత్రం మిత్రులతో షికారుపోయి, రాత్రి చీకటి పడేసరికి ఇంటికి చేరుకునేవాడు ఈ గోపాలం. మిగిలిన కాలమంతా ఆమె గదిలోనే గడిపేవాడు.

ఇలా కొద్ది రోజులు గడిచాయి. ఒకనాడు గోపాలం మామూలుగా సావిత్రి గది దగ్గరికి వెళ్ళేసరికి లోనుంచి సంగీతం వినిపిస్తూంది. అదీ ఏదో పాశ్చాత్యసంగీతం. డాన్సింగ్ ట్యూన్.

అతనాశ్చర్యపోయాడు. రేడియోలో నుంచి ఆ సంగీతం వస్తుండాలి. సావిత్రి కొంచెం పాడుతుంది-కాని, తలుపు వేసుకుని వినేంత రుచి ఏముందా సంగీతంలో?

తలుపు తట్టాడు. మొదటి రెండుసార్లూ జవాబు రాలేదు. మూడోసారి అతను కొంచెం చికాకుగా తలుపు తట్టేలోపున సంగీతం ఆగింది. సావిత్రి వచ్చి తలుపు తీసింది.

తలుపు తీసేసరికి ఆమె నుదురంతా చెమటపట్టి ఉంది. ఆశ్చర్యంగా అతని కళ్ళల్లోకి చూసింది.

'సంగీతం, రేడియో నుంచా?' అన్నాడు గోపాలం చుట్టూ కలయచూస్తూ. వెన్నెల మూలాన కొంత కనపడినా, లోపల లైటు వెయ్యలేదు-చీకటిగానే ఉంది.

"కాదు-రికార్డు" అంది సావిత్రి.

"రికార్డా?" ఆశ్చర్యంగా అడిగాడు గోపాలం.

"ఆఁ.. .ఇంగ్లీష్-ఇన్స్ట్రుమెంటల్. డాన్స్ ట్యూన్."

"ఎక్కడిదీ?"

"నాతో తెచ్చుకున్నాను."


"ఎందుకూ?"

"వట్టినే-నా కా సంగీతం అంటే సరదా.. మీరేం అనుకోరు కదూ?"

"నన్నే మరచిపోయేలాగ ఉన్నావ్-సంగీతంలో పడి.. లైటు వేస్తావా?"

సిగ్గుపడి, లేచి సావిత్రి లైటు వేసింది. గది అంతా విద్యుత్కాంతిలో ఒకసారి మారినట్లనిపించింది.

"అది సరేకానీ, సంగీతం వినడానికి తలుపు వేసుకోవడం ఎందుకు సావిత్రీ?" నిజంగా తెలియక అడిగాడు తను.




సావిత్రి తెల్లబోయి చూసింది. ఏమీ జవాబు ఇవ్వలేదు.

"చీకటే..."

"ఎందుకండీ అలా అడుగుతున్నారు?" బాధగా అడిగింది-ఎందుకంతగా బాధిస్తారన్నట్లు. ఒక్కసారి అనిపించింది తనకు-అనవసరంగా ఎందుకంత గుచ్చిగుచ్చి ప్రశ్నలు వెయ్యడం అని. బహుశా ఆమెకా సంగీతంలో చాలా ఇష్టం వుండవచ్చు; దాన్ని వింటూ తన్మయత్వం పొందివుండవచ్చు; ఆ పాటి దానికి-

"అబ్బే, ఏమీ లేదు. రేడియో సెట్టు..."

ఆ నాటికా ప్రసక్తి మరి రాలేదు.

తరువాత వారం రోజులయ్యాక అలాగే జరిగింది మళ్ళా. ఈ సారి ఆమె తన్మయత్వాన్ని పాడుచెయ్యడం ఇష్టం లేక తాను గుమ్మం దగ్గరనే ఆగాడు.

రికార్డు ఆగింది; సంగీతమూ ఆగింది. కాని లయ వేస్తున్నట్లు శబ్దం వస్తూంది.

అతను తలుపు కొట్టాడు. కొద్ది సెకండ్లలో ఆమె వచ్చి తెరచింది. చికాకుగా లైటు వేసి అతను కుర్చీలో కూలబడ్డాడు. 'ఏమిటి ఇందులో రహస్యం?' అనుకున్నాడు.

సావిత్రి ఏదో నేరం చేసినట్లు తల వంచుకుని నిలబడ్డది. అలాగ కొంతసేపు గడిచాక కూర్చున్నది.

ఇందులో వున్న రహస్యం తనకా నాడూ తెలియలేదు. ఆ రహస్యం తెలియడానికి మరి కొన్ని వారాలు గడవవలసివచ్చింది.

ఆ నాడింక తాను కౌతుకాన్ని చంపుకోలేకపోయాడు. గదిలో నుంచి సంగీతం వినవస్తూంది. నెమ్మదిగా కిటికీ దగ్గరికి వెళ్ళి లోనికి చూశాడు.

సావిత్రి సంగీతవుటలల కనుగుణంగా అడుగులు వేస్తూంది; ఉత్సాహంగా నృత్యం చేస్తూంది. సుడిగాలిలాగ, ఊయెలలా, పాములాగ-రకరకాల కదలికలతో ఆమె నృత్యం చేస్తూంది. తనను తాను మరచిపోయి, సంగీతంలో కలిసిపోయి, ఆమె నృత్యం చేస్తూంది.

అతను కొద్ది నిముషాలు నిశ్చేతనుడై పోయాడు. ఆమె నృత్యం కొనసాగిస్తూనేవుంది.

తరువాత వెనక్కు వచ్చి మెట్లు దిగి తోటలోకి వెళ్లాడు. పచ్చిక మీద కూర్చుని తన ఆశ్చర్యాన్ని నెమ్మదిగా తగ్గించుకోసాగాడు.

ఎందుకిలాగ సావిత్రి నృత్యం చేస్తూంది? ఆ చీకటి ఎందుకు? ఆమె కా నృత్యం ఎలాగ వచ్చింది?

ఈ ప్రశ్న లన్నిటికన్నా, 'ఏమిటి దీని వంతం?' అనే ప్రశ్న అతనినెక్కువగా బాధించసాగింది.

గంట-రెండు గంటలు. రాత్రి తొమ్మిది.

నెమ్మదిగా ఇంట్లోకి వెళ్లాడు. భోజనం చేశాడు సావిత్రి వడ్డించింది. తరువాత మీదికి వెళ్లాడు.

కొంచెం సేపట్లో సావిత్రి మీదికి వచ్చింది. తమలపాకులు అతనికిస్తూ, "ఇప్పటిదాకా ఏం చేస్తున్నారు?" అని అడిగింది.

"చాలాసేపటి క్రిందనే వచ్చాను. నీ నృత్యం పాడుచెయ్యడం ఇష్టం లేక పిలవలేదు" అందామనుకున్నాడుకాని, "ఎక్కడో బాతాఖానీలో పడ్డాన్లే..." అని మాత్రం అనగలిగాడు.

ఎందుకో సావిత్రి అతని కళ్లల్లోకి చూసింది-అతనూ పరీక్షగా ఆమె ముఖంలోకి చూశాడు.

చివరిక ఇద్దరూ మాటాడలేకపోయారు.

కాని, అందరికీ తెలిసిన రహస్యం ఎంత కాలం దాగుతుంది? గోపాలం తన భార్య నృత్యం చేస్తుంది అనే విషయాన్ని భరించలేకపోయాడు. చవకబారు యువతులు నలుగురు మనుషుల్ని ఆకర్షించుకోవడానికే వనికి వస్తుందని అతని ఉద్దేశం. సావిత్రి అతని దృష్టిలో చాలా నీచంగా కనిపించసాగింది. అతని కళ్లు ఎక్స్-రే కళ్లలా పనిచెయ్యసాగాయ్.

ఓ రోజున... చాలా రోజులిలా ఔదాసీన్యంతో, నిశ్శబ్దంగా గడిపిన తర్వాత-అతను చెప్పాడు! "నీ రహస్యం నాకు తెలుసు. సావిత్రీ" అని.

ఆమె తెల్లబోయింది.

"నువ్వు నాట్యం చెయ్యడమైనా మానాలి; మనం వేరైనా అవాలి".

కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా ఉండి, "నా నాట్యం మీకెలా అవకారం చేసింది?" అన్నదామె.

"నా భార్య నాట్యగత్తె కావడం నాకేమీ గౌరవప్రదం కాదు; నాకు నాట్యం మీద గొప్ప ఉద్దేశం ఏమీ లేదు. నువ్వీ నాట్యం ఎలాగ నేర్చుకున్నావో నాకు తెలీదు. కాని, నిన్ను చాలా ప్రేమిస్తున్నాను గనుక ఇన్నాళ్లూ సహించాను-నీ ఎన్నిక త్వరగా ముగించుకో..."

సావిత్రి తల్లిదండ్రులకు, ఈ నాట్యం విషయంలో ఉన్న అభిప్రాయం గోపాలం దృష్టికన్న వేరైనది కాదు. కాని, చిన్నప్పటి నుంచీ, గురువు లేకుండానే సావిత్రి నాట్యాలు నేర్చుకుంది. ఏ సినిమాకు వెళ్లినా, ఒకసారి చూసేసరికి ఆ నృత్యం వచ్చేసేది. ఇంట్లో రికార్డులు తప్పక కొనేవారు. అందుచేత రికార్డు వేసుకుని ఆ నృత్యం పదే పదే చేసేది.

ఆమెకు వయస్సు వచ్చాక చిన్నాన్నతో ప్రతి ఇంగ్లీషు చిత్రానికీ వెళ్లేది రుంబా, జాజ్ నృత్యాలు, బాలెట్‌లూ ఆమెకెంతో ఫేవరిట్స్‌గా ఉండేవి. ఆ నృత్యాలు చూస్తున్నంతసేపూ ఆమెకు ఒక్కసారి ఎగిరిపడదామనేంత ఉద్రేకం వచ్చేది.

ఆ రికార్డులు తానే స్వయంగా కొనుక్కుని తెచ్చుకునేది. వాటితో నృత్యం చేసేది.

ఎన్నోసార్లు అమ్మ సావిత్రితో దెబ్బలాడింది; తిట్టింది; కొట్టింది అప్రతిష్ఠ భయాన. కాని, నృత్యం సావిత్రిలో ఒక భాగం-ముఖ్యమైన భాగం. ఆమె అణువణువులోనూ నృత్యం వుంది; అది ఆమె జీవితం. ఏ సంగీతం వింటూన్నా ఆమె పాదాలు లయతో కదులుతై; వాటి నావడం దుస్సాధ్యం. అయస్కాంతం ఇనుములాగ నాట్యం ఆమెనాకర్షిస్తుంది.

ఈ విషయాలన్నీ ఆమె అతనితో చెప్పింది. తన నాట్యం రహస్యంగా సాగించుకోనిమ్మని ప్రాధేయపడ్డది. సాధ్యమైనంత తక్కువగానే నాట్యం చేస్తానంది.

కాని గోపాలం ఈ ప్రార్థనకు లొంగలేదు. కన్నీళ్లతన్ని కరిగించలేకపోయాయ్. "మళ్లా నాట్యం చేసే వక్షంలో రైలు ఎక్కవలసి ఉంటుం"దని కచ్చితంగా చెప్పాడు.

రెండు రోజులు ముభావంగా, ఎవరి మానాన్ని వాళ్లు మసలుతూ వాళ్లిద్దరూ ముళ్లమీద ఉన్నట్లు గడిపారు.

సావిత్రి మూడోరోజున పుట్టింటికి వెళ్లిపోయింది.

ఆమె ఇంటిని వదలగానే ఒక్కసారి ఆ ఇంటి అందమే పోయినట్లనిపించిందతనికి, పొరపాటు చేశానేమో అనుకున్నా కాని-ఒక్కసారి ఆమె నృత్యభంగిమ జ్ఞప్తికి వచ్చేసరికీ ఆమె మీద ఉన్న అభిమానమూ, ఆమె విషయంలో తాను పొందుతూన్న బెంగా దూరం అయేవి! మంచిపని చేశాననే సంతృప్తి కలిగేది. కులమూ, గౌరవమూ లాంటి పదాలు అతని దృష్టిలో చాలా ప్రాముఖ్యం ఉన్న విషయాలను సూచించేవి.

రెండు వారాలయాక సావిత్రి ఒక ఉత్తరం రాసింది. కాని, కొత్త విషయం ఏమీ అందులో లేదు. "మిమ్మల్ని నిజంగా ప్రేమిస్తున్నాను-అందుకే నా హృదయం విప్పి చెప్పగలిగాను. నా ఒక అలవాటును మీరు క్షమిస్తారనుకున్నాను; అందుకోసం మిమ్మల్ని బతిమలాడాను. కాని, మీరు దయ చూపలేదు. ఈ సరికి కొంచెం శాంతించి ఉంటారనే ఆశతో ఈ ఉత్తరం రాస్తున్నాను. మీ కళ్లలో పడకుండా నా సరదా తీర్చుకుంటే మీ కెందుకు అభ్యంతరం? జవాబు రాయండి-సావిత్రి". ఇదే మొదటి ఉత్తరం.

గోపాలం మొదట దీనికి జవాబు రాయవద్దనుకున్నాడు. తరువాత, తన



చేతగానితనం క్రిందో, అర్ధాంగీకారంగానో ఆ మౌనం బలపడుతుందనే భయంతో జవాబు రాశాడు. "సావిత్రికి: నా ఉద్దేశం ఇన్ని మార్లు మారదు; దాంపత్యాలు సాగాలంటే భర్తలకు భార్యలు లొంగివుండాలేమో. అందుకే గాక, కేవలం నీచవర్గాలు తమ రాబడి కోసం వరికరంగా వుపయోగించుకునే ఒక ఆయుధాన్ని నీలాంటి స్త్రీ తన 'సరదా'గా చేసుకోవడం అధమం. నేను సహించలేను. నిన్నెంతగా నేను ప్రేమించానో నీకూ తెలుసు. కాని. వివాహానికి ముందే ఈ విషయం తెలిస్తే నేను ఈ వివాహానికే సమ్మతించివుండేవాణ్ని కాదు. నా ఉద్దేశం నీకు పూర్తిగా అర్థం అయిందనుకుంటాను-గోపాలం".

తరువాత సావిత్రి ప్రాథేయపూర్వకంగా ఏమీ రాయలేదు. ఒక మాసం తర్వాత, ఇలా రాసింది;

"మనం భార్యాభర్తలుగా జీవితం సాగించడం దుర్లభం అనే విషయాన్ని అవగతం చేసుకున్నాను. మా వాళ్లు స్వార్థంతో మీ ముందు దాచిన సంగతి మీ కవకారం చేసినందుకు చాలా విచారిస్తున్నాను. ఏ సహజాతాన్నీ మానవుడు అణగద్రొక్కలేడు. నాలో విజృంభించిన ఈ శక్తినీ, ఉద్రేకాన్నీ అవుకోడం నా శక్తికి మించిన పని ఐపోయింది-నృత్యం చేయకుండా బ్రతుకలేను. మిమ్మల్ని వదులుకున్నా అలా నృత్యం చెయ్యక తప్పదనే విషయం నాకు ఉన్న ఈ సహజాతబలాన్ని మీకు తెలియజేసి ఉంటుంది. త్వరలో నేనొక చత్రంలో నటించబోతున్నాను. ఒక నర్తకి పాత్ర. ఈ విషయం మీకు తెలియజెయ్యాలనిపించింది; తెలియజేస్తున్నాను."

ఆ చిత్రం సావిత్రి చిన్నాన్న తీసినది. అందులోనే పద్మ గొప్పతార అయింది. చాలా విజయవంతంగా నటించిన పద్మ ఆ చిత్రంతో బాగా బయటికి వచ్చింది. పత్రికలన్నీ ఆమె చిత్రాన్ని మూడురంగుల ముఖాల మీద ప్రచురించుకున్నై. ఏ మూల చూసినా ఈ క్రొత్త నటి పొగడ్తలు వినిపిస్తున్నాయ్...

దాని ఫలితంగా పద్మ అనేకచిత్రాల్లో నటించగలిగింది. ఆరేడు చిత్రాల్లో బుక్ అయింది. అక్షరాలా తారాపథం అందుకుంది. మరెన్నడూ ఆమె అతనికి ఉత్తరాలేమీ రాయలేదు.

గోపాలం ఓ రోజు విశాఖపట్టణం వచ్చాడు. స్టేషన్‌లో దిగేసరికి రాత్రి పది దాటింది. ఒక జట్కావాణ్ని పిలిచి మంచి హోటలుకు తీసుకెళ్లమని జట్కా ఎక్కాడు. వాడు సందుల్లోంచి తీసుకెళ్లి ఒక మేడ ముందు ఆపి, గోపాలం తేరుకునేలోపున "అమ్మా!" అన్నాడు, మెట్ల దగ్గర నిలబడి.

చివాలున తలుపు తెరుచుకుని పద్దెనిమిది వసంతాల శశిరేఖ దీపంతో బయటకు వచ్చింది. గోపాలం ఆమెను చూసేసరికి విషయమంతా గ్రహించుకున్నాడు. ఆమె మెట్లు దిగి అతని దగ్గరికి వచ్చి, "రండి" అన్నది.

మంత్రముగ్ధుడిలాగ అతను నడిచాడు ఆ గదిలోకి, శశిరేఖ బాహువులలోకి! కొత్త గొలుసులలోకి.

000

మరునాడు ఉదయం అతను లేచేసరికి నిన్నటి రాత్రంతా కలలాగా కనిపిస్తూంది.

కాలకృత్యాలు తీర్చుకుని శశిరేఖ ఇంటివైపు బయలుదేరాడు. దారిలో మిత్రుడు వెంకట్రావు కలిశాడు. "ఏం మిత్రమా. చాలా పనిలో ఉన్నావ్?" అని పలకరించాడు గోపాలం.

"రేపు ప్రసిద్ధనర్తకి శ్రీమతి పద్మకు సన్మానం-ఎందుకూ, ఇదిగో ఇన్విటేషన్ ప్రింటు కాగానే ఇస్తాను. ఇప్పుడు కవిశ్రీ చేత సన్మాన పత్రం రాయించాను. అదీ అచ్చు పూర్తి చేయించాలి. పోతాను మరి. మళ్లా పెద్దలందరికీ ఆహ్వానాలు ఇచ్చుకోవాలి."

వెంకట్రావు రెండడుగులు వేసేసరికి గోపాలం అతన్ని పక్కకు పిలిచి, "ఇంతకూ ఆమె వచ్చిందా?" అన్నాడు.

వెంకట్రావు నవ్వి, "ఆమెకంత తీరుబడి వుంటే కావలసినదేముందీ? సన్మానసభ అందుకే మూడు గంటలకు పెట్టాము. రేపు పన్నెండూ ఇరవైకి ప్లేనులో ఎరైవలు; మూడు నుంచి నాలుగూ పది వరకూ సన్మానసభ; ఆరు నుంచి తొమ్మిది దాకా నృత్యప్రదర్శనలు; ఉదయం ఆరు గంటలకు విమానాశ్రయం దగ్గర వీడ్కోలు..." అని అప్పజెప్పి, వెంటనే వెళ్లిపోయాడు.

గోపాలం నడిచి నడిచి శశిరేఖ ఇంటికి వెళ్లాడు. వెళ్లేసరికి ఎవరో యువకుడితో మాట్లాడుతూంది. అతను వెళ్లగానే యువకుడు లేచి వెళ్లాడు.

గోపాలం అక్కడ వున్న ఒక పడక కుర్చీలో కూర్చున్నాడు. శశిరేఖ ఎదురుగా వున్న ఒక కుర్చీలో కూర్చుంటూ, "బ్రతికాననుకున్నారుగా, నేను పోగానే? రాత్రి రాలేదేం?" అన్నది.

"అది సరే; అతనెవరూ?" అన్నాడు నవ్వుతూ గోపాలం.

"మాస్టారు."

"ఏం మాస్టారూ?"

"సంగీతం-"

"ఊఁ..."

"కొత్తగా-"

"ఊఁ...?"

"నాట్యం..."

గోపాలం చూపు ఆమె నుంచి కదలలేదు.

"ఏం అలా చూస్తారూ?"

"ఏం లేదు... నాట్యం నేర్చుకుంటావా?"

"ఆఁ..."

"ఎందుకూ?"

శశి నవ్వుతూ, "ఎందుకేమిటి? నేనూ ఓ గొప్ప స్టార్‌ని ఔదామని బుద్ధి పుట్టింది" అన్నది.

"అందుకు నాట్యం రావాలా?"

"వస్తే అవడం సులభంగా."

"వెరీగుడ్!"

ఎవ్వరూ మాట్లాడలేదు. గోపాలానికి ఏం మాట్లాడాలో తెలియక పూరుకున్నాడు; శశి అతను మాట్లాడలేదని ఊరుకుంది. ఇంతలో కాఫీ వచ్చింది. నిశ్శబ్దంగా తాగి సిగరెట్ ముట్టించాడు గోపాలం.

సిగరెట్ పొగ గాలిలోకి వదులుతూ, "రేపు నేను వెడతాను-బహుశా" అన్నాడు గోపాలం.

"ఏం?"

"పనుంది."


"నాకు తెలుసు."

"ఏమిటి?"

"ఎందుకు వెళ్తారో..."

"ఎందుకూ?"

"కోపం."



"ఎవరి మీదో?"

"నా మీదే..."

"... ... ..."

"నాట్యం మాస్టారు ముసలాళ్లేగా-అదీ కాక మీరెప్పటికీ నన్ను నమ్మనూలేరు..."

సిగరెట్ పొగ.

"మీతో చెప్పలేదు కానీ, ఒక డాన్సింగ్ ట్రూప్‌లో నాకు ఆఫర్ వుంది; ఆర్నెల్లు నేర్చుకుంటే ప్రదర్శనలకు చాలు."

శూన్యదృక్కులు.

"అప్పుడు మీ అలోడియల్స్‌లోకి నేనూ వస్తాను. అంతేగాని మనకు ప్రేమేమిటీ?"

నవ్వు.

"రేపు మరి పద్మ ప్రోగ్రాంకి రారూ?"

"ఏమో!"

"మరి..."

"టిక్కెట్ నీ దగ్గర వుంచు..."

"వద్దు. నేను వెళ్లాలంటే ఎలాగైనా వెళ్తాలెండి."

గోపాలం ఒకసారి క్రిందికి చూసి, తొందరగా, "అంతా గమ్మత్తు... అయిదూ అయేసరికి అప్పరలాగ సిద్ధమే. నేను టాక్సీ మీద వస్తాను" అన్నాడు.

"నిజం?"

"స్నేహితులు వీడిపోయేటప్పుడూ అబద్ధాలే?"

శశి తెల్లబోయి చూసింది. "ఏమిటన్నారూ?"

"రేపు చెప్తాగా..."

శశి ఇంక ఏమీ అడగలేదు. "నాకు తెలుసు. మన కథకు అంతం వచ్చిందని... రేపు చివరి రోజైతే, ఆనందంగానే విడిపోదాము" అన్నది.

అతను లేచాడు.

000

మూడు గంటలు.. కార్లు. జట్కాలు, బస్సుల, యువకులు, వృద్ధులు, వైష్ణవులు, శైవులు, కాంగ్రెస్, కమ్యూనిస్ట్, పోలీస్, బిచ్చగాళ్లు, ఫోటోగ్రాఫర్లు. కిటకిటలాడుతూంది ప్రాంగణమంతా.

ఒక్కసారి ఉత్సాహం... "పద్మ వచ్చింది... " త్రోపులాట. గలభా...

కార్యదర్శి సన్మానపత్రం చదువుతున్నాడు. "కళాజీవి, నృత్యకళకు ప్రాణం పోసిన కళాతపస్విని. ఆంధ్రదశపు కళామతల్లికి మెరుగులు దిద్దిన ధన్యజీవి."

కరతాళధ్వనులు.

ఉపన్యాసాలు. ఫోటోలు. ఆటోగ్రాఫ్‌లు.

నటి చేతి గడియారం చూసి శ్రీ అధ్యక్షుల వారితో ఏమో అంది. వెంటనే అధ్యక్షుల వారు లేచి వెనక్కు వెళ్లి గ్లాసుతో పానీయం తెచ్చి ఇచ్చారు. ఫోటోలు, కరతాళధ్వనులు.

గోపాలం లేచి బయటికి వెళ్లాడు.

000

శశిరేఖా, గోపాలమూ ఒకటో వరుసలోనే కూర్చున్నారు. సరిగా సమయానికి తెర ఎత్తారు. ఒకరిద్దరు పురప్రముఖులు ముందు పద్మ నాట్యఘనతను గురించి మాట్లాడారు.

తరువాత పద్మ రంగం మీదికి వచ్చింది. మొదటిది గోపికానృత్యం, అందులో పద్మ కృష్ణుడుగా నాట్యం చేసింది. తరువాత పాములవాడు, తరువాత రాధావిరహం.

గోపాలం చుట్టూ కలయజూశాడు. అందరూ తన్మయులై చూస్తున్నారు. వాళ్లు ఊపిరి తీస్తున్నారో లేదో చూస్తేగాని తెలియడం లేదు. ఒక్కొక్క నాట్యం కాగానే కరతాళధ్వనులు చెలరేగుతున్నై. థియేటర్ అంతా కిటకిటలాడుతూంది.

శశిరేఖ కూడా చాలా అనురక్తితో చూస్తూంది. అప్రయత్నంగా ఆమె కాలివ్రేళ్లతో నేల మీద లయ వేస్తూంది. ఆ వ్రేళ్ల వంక ఒకసారి గోపాలం దృష్టి పడింది. నవ్వుకున్నాడు.

ప్రదర్శన పూర్తి అయింది.

"బీచ్‌కి పోదామా?" అన్నది శశిరేఖ వెన్నెలను చూస్తూ.

"ఉహు. ఉదయం నేను ఈ ఊరి నుంచి వెళ్తున్నాను. ఇంటికి దిగబెడతాను పద" అని గోపాలం టాక్సీ ఎక్కాడు. మెట్ల దగ్గర నిలబడి శశికి జేబులో నుంచి ఒక కవరు తీస్తూ "అందులో వెయ్యి రూపాయలకు చెక్కూ, నా ఫోటో ఉన్నై. మనం మళ్లా కలుసుకుంటే అది అదృష్టమే అవుతుంది" అన్నాడు గోపాలం. టాక్సీ కదిలింది.

రాత్రి పదకొండు గంటలైంది. వెన్నెల విరిసిన మల్లెల కెరటాలల్లే పొంగిపొరలుతూంది.

పద్మ కాపలావాడు "ఎవరది?" అన్నాడు.

నలుగురు పెద్దమనుష్యులు లోపలి నుంచి వస్తున్నారు.

గోపాలం ఒక విజిటింగ్ కార్డ్ అతనికిస్తూ, "పోయి ఇచ్చి రా" అన్నాడు.

"అమ్మగారు దెబ్బలాడతారు బాబూ! నిద్ర టైము" అని వాడు నసిగాడు.

ఒక రూపాయి వాడిని లోనికి పంపించింది. మరుక్షణం వాడు వచ్చి "రండి బాబూ, రండి" అన్నాడు.

ఇంతలో పద్మే బయటికి వచ్చి అతన్ని లోని గదిలోకి తీసికెళ్లింది.

లైటు వేసి ఆమె ఒక సోఫాలో కూర్చుంది. గోపాలం చిరునవ్వుతో ప్రక్కన కూర్చున్నాడు.

ఆమె నెమ్మదిగా అతని వైపు కన్నులు తిప్పింది. అతనామె చేతులను తన చేతులలోకి తీసుకున్నాడు.

"దయ కలిగింది" అన్నదామె.

"కాదు. కళ్లు విడాయి. నిన్నెంతగా ప్రేమించానో నువ్వెళ్లాక తెల్సింది. బాధించానా?" అన్నాడు అతను.

కొద్ది నిముషాలు ఇద్దరూ మౌనంగా గడిపారు. ప్రక్క గదిలో టెలిఫోను అల్లరి చేస్తూంది. బంట్రోతు దాని గొంతు నొక్కాడు.

అతను లేచి వెళ్లి టెలిఫోన్ తీసి "ఏరోడ్రూమ్ ప్లీజ్" అన్నాడు.

వెనుక నుంచి ఆమె అతని చేతిలో నుంచి రిసీవర్ తీసుకుంది.."ఇందాకటి ఎక్స్‌ట్రా రిజర్వేషన్ కన్ఫర్మ్ చేశాను."

అతను తెల్లబోయాడు. ఆమె చిరునవ్వు నవ్వింది.

"అసాధ్యురాలివి సావిత్రీ! లేక పద్మా అనాలా?"

"మీకు ఎప్పటికీ సావిత్రినే!" ఆమె రిసీవర్ క్రింద ఉంచుతూ అన్నది.

■

